# వెన్నెముగల గొంతుకలు

## అంటరానోళ్ళ ఆత్మకతలు

"అప్పటికీ ఇప్పటికీ నీకు దైర్నం తగ్గలేదు పెద్దమ్మా! మనిసివి గూడ ఏం మారలా!" మా రోశ పెదమ్మతో అన్నా నేను.

"ఆ ఇప్పడా రోజులన్నీ బోయినయి నాయనా! ఎన్ని కష్టాలు పడితేనో బతుకు ఎల్లమారింది" అజ్జెప్పింది.

"అవునుగాని పెదమ్మా! పెదనాయన బొయ్యినంక నువ్వు అత్తింటికి బోలా?"

# పెదబోడెమ్మంటే కుశాల గాదు

"మాది లింగారెడ్డిపల్లె అయితే నన్ను అల వలపాడు కిచ్చింద్రు. మీ పెదయ్య పేరు కుమ్మ ఢకుంట ఢోశయ్య గదూ! ఆయనప్పుడు రోడ్డు పని జేస్తా వుండేది. అప్పుడందరం కూడా వుంటిమి. ఇంగ మేము వేరు బడితిమి. అట్టుండంగ ఆయన కొకసారి యాందో జబ్బొచ్చింది. యాపసెట్టు కింద కూలబడి పోయిందు. మా మరుదులు ఒంగోలుకు తీసకబొయ్యిరి, ఇంగ అంతేనయ్యా! ఆయన ఆస్పత్రిలో సచ్చిపోయిండంట. ఈడకు దీస్కరాను డబ్బులేక ఇంగ శవాన్ని యాన్నో బారేసింద్రంట. యాం జేసేది? గుడ్లల్లో నీల్లు కుక్కుకునేది. నా కొడుకు రోశయ్యేమో కడుపులో వుండాడు. ఆరో నెల.

అప్పుడు మా నాయనేమన్నడంటే "పెదబోడెమ్మా పిల్లోన్నైనా బోగొడతాగానీ నిన్ను బోగొడతనా?" అన్నడు.

"ఆ పెదబోడెమ్మెవురు మద్దిలో" అనడిగిన నేను.

"నేనే గదూ! నాకు రెండు పేర్లుండాయి నాయనా" అని మల్లీ చెప్పను మొదలేసింది.

ఇంగ ఆనవే వొచ్చి యిక్కడ గుడిసేసుకోనున్న. ఆపనీ ఈపనీ జేసుకుంటా రోశయ్యను పెద్దగ జేసిన. కానీ యానాడూ యాస్టపడింది లేదు. మొగాడ్లాగ దైర్నంగా వుండిన.

* * * * *

ఒకసారి కట్టెలకి బోయినాం. రెడ్డితోట గుండా బోతావుంటే ఆ మామిడి చెట్లకి కాయలు ఇరగ్గా సినయ్యి, వూరక అట్ల కోసినం. ఆనాక కట్టెల మోపులు కట్టుకోని దప్పికయితుంటే నీళ్ళు తాగను బోతున్నం. రెడ్డి మా యెనక వొచ్చింది మేము చూసుకోలా! నీళ్ళు తాగనిచ్చి యెనక మాలుగొచ్చి నన్ను కుదేసి బడమాకిండు. అప్పుడు నేనేం జేసినవంటే నా యంటొచ్చిన ఆడోళ్ళనందరినీ యెనక్కి బొమ్మని జెప్పి వాన్ని బట్టుకోని రెండు సేతల్తో, రెక్కలు బట్టుగోని యిసిరిన. ఆ గుంతలో బడ్డడు. రెడ్డాయన బో అలిశిగానోడు, నా మీన ఎత్తుంటడు. నీ యెత్తుంటడు. ఆ గుంటలో బడ్డాక లేస్తా వొంగుతా మునగతా తిడతా వున్నడు నన్ను.

అప్పుడే రోశయ్య బుట్టి వున్నడు. అప్పుడు బాగున్నా పరువులో

అప్పడా రెడ్డాయనో ఎట్లనో పైకొచ్చి- :రే యిది యింత పన్జేసినాది మాదిగది. యేదో పాటు జెయ్యాలని జెప్పి ఇంటికొచ్చిండు. నేనాయన ఇంట్లోనే పని జేస్తా వుండిన. ఆనక ఆయన

**—ఎండ్లూరి సుధాకర్**

చిగ్గుబోతదని గావాల ఇంగ ఈ చంగతి వూర్లో జెప్పలా. నేను మామూలుగానే ఆ యింట్లో పనిజేస్తా వుండిన.

* * * * *

అట్టనే నేను తాసుపాములకి గూడ బయపడలా నాయనా! ఒకసారి రోశయ్య యానవో కాలిరిగి మంచంలో వుండడు.

ఓ తంద్రా! పాము గాదది. అలివి గాకుండా పడగిప్పి ఆడతా వుండాది మా గడప ముందు. నీ యెత్తుండాది. యింతెనువమండది. యాంది? దాని పడగ యెలుపే యింతుండది. ఆనవే ఆడొక కట్టె వుండది. ఇంగ ఆ కట్టె దీసుకోని లగువు దీసి అట్టనే బొయ్యి బాదు మీన బాదు, బాదు మీన బాదు బాదేసిన, కొట్టేవరకి యింతెత్తు లేసింది. అప్పడేం జేత్తము? బుస్సున పైకి లేసింది. ఓ యమ్మా అని పిలకాయలు మంచమెక్కిన్రు.

ఇంగనాకు వేరే కట్టె జిక్కలా! యేం జేసేది? ఆ కట్టెతోనే గొట్టిన. యేటు మీన యేటు, యేటు మీన యేటు కొట్టేవరకి జనాలు బిత్తర బొయ్యింద్రు, ఊరంతొచ్చింద్రు. ఆ తాసుపామును మా మంది పోలయ్య కాల్జేసిండు.

* * * * *

"యాంది పెదమ్మా! బలే గొట్టినావులే పాముని. అంత దైర్నం యాడిది నీకు? నాకు పాముని

ఆంధ్రజ్యోతి వారపత్రిక 23.8.96

సూడాలంటేనే బయం గదూ!" అన్న.

"ఇంగోసారి కొండగొర్రెని బట్టిన తెలుసా?" చిటికేసి సెప్పింది పెదమ్మ.

"బలేగుందే! ఆ కతేందో జెప్పు"

"ఒకసారి తెల్లవారు జామున్నే కట్టెలకి బోయినం. ఇరవై మంది దాక బోయినం ఆ పాలకొండకి. మన గూడేనికి మూడు వాలుగు మైళ్ళుంటాది. అందరం కొండెక్కుతున్నం. నా సేతిలో కొడేలుంది. ఒక బండ సందులో కొండగొర్రె కాలిరుక్కోని వుండాది.

పిచ్చన్న జూసిందు.

"మ్మేయ్! పెదబోడెమ్మ!" అని పిలిసిందు.

"సూడమ్మే! ఆడ పొట్టేలుండది. దాన్ని ఎట్లైనైన కోద్దము" అన్నాడు.

అవ్వుడు నేనన్నా గదా! యాందన్నా యించేవు జూసేది? అని అవంతనే రెండు పలువురాళ్ళు దీసుకోని కోరి పారదెన్నిన. కోసి పొట్టదీసి, కాళ్ళు దీసి అన్నీ మూటగట్టి రెండు మూడు సంచులకు బెట్టుకోని, కాసిని కట్టెలేరుకోని తిరిగొచ్చినం. వాకా కూర పాలదని తలకాయ, కాళ్ళూ కట్టెల్లో బెట్టుకున్న.

ఇంగ గూడేనికొచ్చి, దాన్ని గోసుకోని తలా ఒక బాగమేసుకోని వండుకున్నం. ఇంగ తోలుంటే నేమూ ఆ పిచ్చన్న తీసుకున్నం. ఆయాల వరికూడు వండుకోని తిన్నం.

అయ్యా! ఆయాల తలకాయ మాంసం అదర గుమ్మిందిలే!

* * * * *

రోసి పెదమ్మ ధైర్నానికి వాకు సిత్రం దోసింది. "బో యాటాడేదానివన్నమాట" అన్నా.

"అప్పట్లోనే మేం తంగేడు కట్టెలకి కొండలకి బోయినాం. అవ్వుడు కుందేలుని యాటాడిన."

"అయితే అన్ని రుచులూ జూసివావు పెదమ్మా! కుందేలు గోసుకున్నారా?" అనడిగిన.

"ఆ యింతలావు కుందేలు ఎగిరొచ్చింది. పేరాలు దీస్తా వుండది. తలా ఒక తట్టు బోయి కమ్ముకున్నం. నా దగ్గిర కొడేలుంది. యింత బొడుగుది. తంగేడు కట్టెలు గోసేది. దాంతో యేసిన ఆ వనే! యేసేలేకి తిరగబడింది. ఒక తట్టుదట్టి తగులుకున్నంక ఆ వన్నే సచ్చి పోయింది. ఇంటికి దీసకబోయి తలావక బాగం దీస్కోని కొర్రకూడు జేసుకోని తిన్నం".

పెదబోడెమ్మతో కుశాల గాదు. అలివిగాంది అనుకోని నవ్వుకుంటా దిన్నరు.

ఇంగ ఆ రేతిరి ఆరుబయట మలక మంచమేసుకోని పొనుకుంటే నందమామలో కుందేలు వా తట్టే సూస్తా వుండాది గావాల అనుకువ్నా.

* * * * *

ఎవ్వురైనా గాని వాయనా! పట్నం బోతున్నరంటే అళ్ళ ఆడోళ్ళకి నన్ను కాపలా బెడ్తరు. ఆ యమ్మిని రమ్మను. రోశమ్మని బిలవండి. బాగా నిబ్బరంగుంటది అని యాదున్న నన్ను బిలసకబోయే వోళ్ళు. ఆ యాడోళ్ళు పకపకా నవ్వుతా వుండేది. అదొక జాంతుగ, కుశాల గుండేది. సంసారులైన దీస్కబోతరు నన్ను. గుండె గల దాన్నని, ధైర్నం గుంటనని.

రోడ్డు మీదకైనా సరే! ఎంత రేతిరైనా నన్ని ఎంటబెట్టక తీసుకబోయ్యేది. వాళ్ళు బస్సెక్కేంధాక వుండేది. ఆ వంతనే ఒక్కదాన్నే ఎంత రాత్రయినా నడిసొచ్చేది. ఎంత లావు పామొచ్చినా దాన్ని సంపను నన్ను దీసక బోవాలసిందే!

ఒకనాడైతే మజ్జెరాతిరి పెద్దకాలవ దగ్గిర దెయ్యం గావొచ్చింది. యాందిదని అనుకునే వరకి యింతెత్తున లేసిందయ్యా. తెల్ల గుడ్డలతో, ఇంగ నేను వురికెత్తిన సగానికి. ఆ వనే చూసి మనిసిగాదులే అనుకోని మన సేలోకొచ్చిన. మన సేలోకొచ్చి యాందో సూద్దమని కొడేలి దీసుకోని మల్లీ బోయిన పెద్దకాలవ కాడికి. పొయ్యేలేకి మనూరోల్లు ఇద్దరుండరు కావులు.

యాంది రోశమ్మ ఇయ్యార కాడికి వొచ్చినావు ఒక్కదానివి. ఇంగ కాత్త కోడీబోడీ గూసినవుడు రాగూడదా? అన్నరు.




కోడికూసేటవ్వుడు మా చేలకి నీళ్ళు జిక్కుతాయా సామీ! మీరేమి రానిత్తరా? అని అవ్వుడు సైగ్గ సంసారుల కాలవలన్నీ బిగిచ్చిపెట్టి మన చేనుకు నీరు బారించేది. పొరినంత సేవు లచ్చినంగ కూసునేది. ఆ వంతనే మట్టసంగ కాలవలన్నీ తెరిసేది ఎవురికీ తెలియకుండ యింటి కొచ్చేది.

* * * * *

కష్టంజేసి బట్టగట్టి పొయ్యింది నెత్తి. ఎక్కడెక్కడ పనంతా జేస్తా వుండిన. కొండకు బొయ్యి కట్టెలు దెచ్చేది. నాలుగైదు మణుగులుండే కట్టెలు దెచ్చేది. బస్సు కేసేది. మళ్ళీ పనులకి బొయ్యేది. కోతలకీ, నాట్లకీ, వరికోతకీ పోయ్యొచ్చేది. యిక్కడ బర్రెకి గడ్డి దెచ్చేది. పాలు తీసేది. ఒక్క కస్టమంటవా వాయనా! కస్టాన్నే నమ్ముకున్నగానీ యింగ దేన్నీ నమ్ముకోలా! బాదలంటే సెప్పనలివి గానివి. అదిగో పాలకొండకి చిన్నప్పట్నుంచి కట్టెలు తేను బొయ్యేది. అరవయ్యేండ్లు బొయ్యిన. ఇంగా బోతా వుండా! కొడేల్లు మారినయ్యిగాని నా బతుకు మార్లా! నా కస్టానికీ సుకానికీ ఆ పాలకొండే సాచ్చీకం. ◆